క్లుప్తంగా

లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో లక్ష్మీనరసింహస్వామి

గోపవరం : మండలంలోని వల్లెరవారిపల్లె గ్రామంలో వెలసిన లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో వైశాఖమాసం నాల్గవ శనివారం సందర్భంగా స్వామి, అమ్మవారికి ప్రత్యేక అభిషేకం, పూజలు నిర్వహించారు. భక్తుల దర్శనార్థం స్వామివారిని ప్రత్యేక అలంకరణలో ఉంచారు. స్థానికులతో పాటు చుట్టుపక్కల గ్రామాల నుంచి తరలివచ్చిన భక్తులు స్వామి వారికి కాయకర్పూరం సమర్పించుకున్నారు. వచ్చిన భక్తులకు ఆలయ పూజారి పెంచలయ్యస్వామి తీర్థప్రసాదాలు అందజేశారు. మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు.

సౌమ్యనాథున్ని దర్శించుకున్న రాచమల్లు



సౌమ్యనాథ స్వామి ఆలయ సన్నిధిలో ఎమ్మెల్యే రాచమల్లు, నాయకులు

ప్రొద్దుటూరు : నందలూరులోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన సౌమ్యనాథస్వామిని శనివారం ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి, ఆయన సతీమణి రాచమల్లు రమాదేవి దర్శించుకున్నారు. స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. ఆంజనేయస్వామికి పూజలు నిర్వహించారు. ఆలయ నిర్వాహకులు వారికి తీర్థ ప్రసాదాలు అందించి సత్కరించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు పిట్టా బాలాజీ, భూమిరెడ్డి వంశీధర్ రెడ్డి, వరికూటి ఓబుళరెడ్డి, వైఎస్సార్‌సీపీ అదనపు కార్యదర్శి పోరెడ్డి నరసింహారెడ్డి, మాజీ కౌన్సిలర్లు పిట్టా భద్రమ్మ, శౌరి సుభాష్‌రెడ్డి, రాజుపాళెం మండల అధ్యక్షుడు గుద్దేటి రాజారాంరెడ్డి పాల్గొన్నారు.

ప్రొద్దుటూరు తపాలా డివిజన్‌కు అవార్డులు



అవార్డు అందుకుంటున్న పోస్టల్ సూపరింటెండెంట్ జి.కిరణ్

ప్రొద్దుటూరు కల్చరల్ : ప్రొద్దుటూరు తపాలా డివిజన్ ఉద్యోగులు గడచిన ఆర్థిక సంవత్సరంలో వివిధ అంశాల్లో 6 అవార్డులు సాధించారు. ఇటీవల ఆంధ్రప్రదేశ్ తపాలా సర్కిల్‌కు సంబంధించి విశాఖపట్నంలో జరిగిన సమావేశంలో అవార్డుల ప్రదానోత్సవం నిర్వహించారు. అన్ని విభాగాల్లో పనితీరు, నికర కొత్తపొదుపు ఖాతాల ప్రారంభం, అత్యుత్తమ బట్వాడా, పోస్టల్ లైఫ్ ఇన్సూరెన్స్‌లో కొత్త ప్రీమియం సేకరణ, జనరల్ ఇన్సూరెన్స్ తదితర విభాగాల్లో ప్రతిభ కనపరచినందుకు ఈ అవార్డులు పోస్టల్ డివిజన్‌కు లభించాయని పోస్టల్ సూపరింటెండెంట్ జి.కిరణ్ తెలిపారు ఏపీ సర్కిల్ చీఫ్ పోస్ట్‌మాస్టర్ జనరల్ కె.ప్రకాష్, ఉన్నతాధికారుల నుంచి ఈ అవార్డు అందుకున్నట్లు వివరించారు. ఈ సందర్భంగా పోస్టల్ డివిజన్‌లోని ఉద్యోగులను అభినందించారు.

వృద్ధులకు పండ్లు పంపిణీ

ప్రొద్దుటూరు : మోడంపల్లెలో శనివారం ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంకు ఫార్మేషన్ డే సందర్భంగా వీరబ్రహ్మేంద్రస్వామి వృద్ధాశ్రమంలోని వృద్ధులకు పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బ్రాంచ్ మేనేజర్ సుదర్శన్‌రెడ్డి, సిబ్బంది, రిటైర్డు గ్రామీణ బ్యాంకు ఉద్యోగులు గురివిరెడ్డి, కొండయ్య పాల్గొన్నారు.

విత్తన దుకాణాల్లో విజిలెన్స్ తనిఖీలు



నిల్వలను పరిశీలిస్తున్న అధికారులు

ప్రొద్దుటూరు క్రైం : మైదుకూరు రోడ్డులోని విత్తన దుకాణాల్లో విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు శనివారం తనిఖీలు నిర్వహించారు. భారత్ సీడ్ ఏజెన్సీస్, వెంకటేశ్వర సీడ్ ఏజెన్సీల్లో రికార్డులు పరిశీలించారు. రికార్డులు, నిల్వల్లో తేడాలు ఉండటంతో దుకాణ యజమానులకు అమ్మకపు నిల్వ నోటీసులను అధికారులు జారీ చేశారు. నిబంధనలకు లోబడి విత్తనాలను రైతులకు విక్రయించాలని అధికారులు తెలిపారు. నిబంధలను ఉల్లంఘిస్తే చర్యలు తీసుకుంటామని దుకాణదారులను హెచ్చరించారు. తనిఖీల్లో విజిలెన్స్ అధికారులు జి. ఈదురుబాషా, బాలగంగాధర్‌రెడ్డి, జి. శ్రీనివాసులు, జే. మురళీకృష్ణ, సుస్మిత, వ్యవసాయాధికారులు పాల్గొన్నారు.

పవనసుతుడికి భక్త నీరాజనం



బద్వేలు అర్బన్ : ప్రత్యేక అలంకరణలో దర్శనమిచ్చిన అంజన్న



ప్రొద్దుటూరు : ప్రత్యేక అలంకరణలో అభయాంజనేయుడు



చాపాడులో ప్రత్యేక అలంకరణలో వీరాంజనేయ స్వామి



ప్రొద్దుటూరు కల్చరల్ : ప్రత్యేక అలంకరణలో ఆంజనేయస్వామి



ఆంజనేయస్వామికి అరటిపళ్ల అలంకరణ



మైదుకూరు: ప్రత్యేక అలంకరణలో ఆంజనేయస్వామి మూలవిరాట్

ప్రొద్దుటూరు కల్చరల్ : హనుమాన్ జయంతిని పురస్కరించుకుని పట్టణంలోని పలు ఆలయాల్లో ఆంజనేయస్వామివారికి ప్రత్యేక పూజాకార్యక్రమాలను నిర్వహించారు. స్థానిక పాతమార్కెట్‌లోని ఆంజనేయస్వామి ఆలయంలో వేకువజామున ఆంజనేయ స్వామి వారి మూలవిరాట్‌కు పంచమృతాభిషేకం నిర్వహించి ప్రత్యేకంగా గజమాలతో, వడమాలతో అలంకరించారు. ఆకుపూజ చేసి తమ మొక్కులను తీర్చుకున్నారు. అలాగే టూటౌన్ సమీపంలోని అభయాంజనేయస్వామి ఆలయంలో ఆంజనేయస్వామి మూలవిరాట్‌కు ప్రత్యేక పూజలు చేసి అలంకరించారు. అలాగే ఆలయ ప్రాంగణంలోని భారీ ఆంజనేయస్వామిని అరటి పళ్లతో అలంకరించారు. మధ్యాహ్నం భక్తులకు అన్నప్రసాద వినియోగం జరిగింది. రామేశ్వరం మోరీల సమీపంలోని ఆంజనేయస్వామి మందిరంలో స్వామివారికి ప్రత్యేక పూజలతో పాటు పెద్ద ఎత్తున భక్తులకు అన్నప్రసాద వినియోగం జరిగింది. అలాగే పట్టణంలోని పలు అంజనేయస్వామి ఆలయాల్లో హనుమత్ జయంతి సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు.

పోరుమామిళ్లలో..

పోరుమామిళ్ల: పట్టణ శివారులోని మల్లకతువ వద్ద వెలసిన పురాతన శ్రీ అభయాంజనేయస్వామి దేవస్థానంలో శనివారం హనుమజ్జయంతి ఉత్సవాలు అంగరంగ వైభవంగా జరిగాయి. ఉదయం 6 గంటలకు మూలవిరాట్‌కు అభిషేకం, అర్చన, విశేష అలంకరణ నిర్వహించారు. 8 గంటల నుంచి శ్రీ లక్ష్మీ వేంకటేశ్వరస్వామి దేవస్థానం నుంచి అష్టోత్తర కలశాలతో మహిళలు రామనామ సంకీర్తనతో అభయాంజనేయస్వామి ఆలయం వరకు శోభాయాత్ర నిర్వహించగా ముందు భాగంలో చిన్నారుల కోలాటం పట్టణ ప్రజలను ఆకట్టుకుంది. అనంతరం శ్రీ అచలానంద ఆశ్రమ పీఠాధిపతి విరజానందస్వామి ఆధ్యాత్మిక ప్రవచనం చేశారు. హిందూధర్మం, సంప్రదాయం, సంస్కృతుల గురించి వివరించారు. ఆంజనేయుని చరిత్ర ద్వారా ప్రజలు తెలుసుకోవలసిన ధర్మమార్గాన్ని తెలిపారు. సమాజం ధర్మమార్గంలో నడుస్తున్న కాలం శాంతి వెల్లివిరుస్తుందని, పాడిపంటలకు లోటు ఉండదని స్వామి పేర్కొన్నారు.

మధ్యాహ్నం ధర్మకర్త శెట్టిం చెన్నయ్య ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం చేశారు. పట్టణంలోని గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద నూతనంగా నిర్మించిన శ్రీ ఆంజనేయస్వామి ఆలయంలో ఉదయం పూజలు, అభిషేకం నిర్వహించారు. స్వామికి పూలు, వడలు, ఆకులతో విశేష అలంకరణ చేశారు.

ఘనంగా హనుమాన్ జయంతి

కలసపాడు : మండలంలోని మహానందిపల్లె, సిద్ధమూర్తిపల్లె, కలసపాడు, పాత రామాపురం, ఎగువ రామాపురం, తెల్లపాడు గ్రామాల్లో శనివారం హనుమాన్ జయంతి వేడుకలను భక్తులు ఘనంగా నిర్వహించారు. ఉదయం స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు ఆంజనేయ స్వామిని సందర్శించి పూజలు నిర్వహించారు. మహానందిపల్లె సావిశెట్టిపల్లెకు చెందిన భజన బృందం చేసిన హరినామ భజన భక్తులను ఆకట్టుకుంది. పలు గ్రామాల్లోని ఆలయాల వద్ద భక్తులకు అన్నదానం చేపట్టారు.

భక్తి శ్రద్ధలతో హనుమాన్ జయంతి

ప్రొద్దుటూరు : మండలంలోని కామనూరు గ్రామ సమీపంలోని కుందూ నది ఒడ్డున ఉన్న మన గోశాలలో హనుమాన్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. శ్రీఅభయాంజనేయస్వామికి విశేష అభిషేకాలు, అర్చనలు నిర్వహించి ప్రత్యేకంగా అలంకరించారు. హనుమాన్ చాలీసా పారాయణం చేశారు. పెద్ద సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ సోమా లక్ష్మీనరసయ్య, చీతిరాల నాగార్జున, సంగిరెడ్డి శ్రీనివాసరెడ్డి, విశ్వహిందూ పరిషత్ కార్యకర్తలు పాల్గొన్నారు.



ప్రత్యేక అలంకరణలో సీతారామాంజనేయస్వాములు

బి.మఠంలో..

బ్రహ్మంగారిమఠం: హనుమాన్ జయంతి సందర్భంగా శనివారం మండలంలోని ఆంజనేయ స్వామి ఆలయాల్లో ఘనంగా హనుమాన్ జయంతి వేడుకలు నిర్వహించారు. బి.మఠంలో బద్వేల్‌రోడ్డులో ఉన్న ఆంజనేయ స్వామి ఆలయంలో నాగిపోగు ఓబయ్య ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు, భజనలు, భక్తులకు అన్నదానం నిర్వహించారు. మండలంలోని పలు గ్రామాల్లో హనుమంతుడికి ప్రత్యేక పూజాలు చేశారు.

వైభవంగా హనుమాన్ జయంతి

మైదుకూరు : మైదుకూరులో శనివారం హనుమాన్ జయంతిని వైభవంగా నిర్వహించారు. మైదుకూరులోని శ్రీమాధవరాయస్వామి ఆలయంలో వెలసిన పురాతన ఆంజనేయస్వామికి ప్రత్యేక అలంకరణలు చేసి పూజలు, అర్చనలు నిర్వహించారు. మున్సిపాలిటీ పరిధిలోని శ్రీనగరంలోని పంచముఖ ఆంజనేయస్వామి ఆలయంలో మూలవిరాట్‌ను ప్రత్యేకంగా అలంకరించి పూజలు, అర్చనలు, హోమాలు నిర్వహించారు. మధ్యాహ్నం అన్నప్రసాద వినియోగం చేశారు. పాతపాలెం గ్రామంలో అభయాంజనేయస్వామి ఆలయంలో హనుమజ్జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. మండలంలోని కొత్తపల్లె సమీపంలో ఆంజనేయస్వామి ఆలయంలో హనుమాన్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించి, అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు.

చాపాడు: మండల వ్యాప్తంగా శనివారం హనుమజ్జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రమైన చాపాడు సమీపంలోని సీతారామాపురం రోడ్డులో ఉన్న వీరాంజనేయ స్వామి సన్నిధిలోని ఉదయం నుంచి సాయంత్రం వరకూ ప్రత్యేక పూజలు చేశారు. ప్రత్యేక అలంకరణలో దర్శమిచ్చిన వీరాంజనేయ స్వామిని దర్శించుకునేందుకు వచ్చిన భక్తులకు పెద్ద ఎత్తున అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

అంజనీ పుత్రుడికి నీరాజనాలు

బద్వేలు అర్బన్ : పవనసుతుడైన హనుమంతుని జయంతిని శనివారం వాడవాడలా ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా ఆలయాలలోని ఆంజనేయస్వామి విగ్రహాలను సుందరంగా అలంకరించారు. స్థానిక పోరుమామిళ్ల రోడ్డులోని దిగువ బ్రాహ్మణవీధిలో మారుతి భజన మండలి ఆధ్వర్యంలో నిర్మించిన ఆంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామివారికి ఆకుపూజ, అభిషేకం నిర్వహించారు. ఈ ఆలయంలోని 49 అడుగుల ఆంజనేయస్వామి విగ్రహాన్ని సుందరంగా అలంకరించారు. అలాగే ఫైర్ ఆఫీసు వెనుకభాగంలోని శ్రీగోదాదేవి సహిత వెంకటేశ్వరస్వామి, ఆంజనేయస్వామి ఆలయంలో పంచామృతాభిషేకం, హనుమాన్ వ్రతం ఘనంగా నిర్వహించి సాయంత్రం గ్రామోత్సవం నిర్వహించారు. అలాగే నెల్లూరు రోడ్డులోని పురాతన అభయాంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. అలాగే ఆంజనేయనగర్, రాజుగారివీధి, పాత పోస్టాఫీసు వీధి, నాగులకట్ట శివాలయం వద్దగల ఆంజనేయస్వామి ఆలయం, గాండ్లవీధి, బైపాస్ రోడ్డులోని అభయాంజనేయస్వామి ఆలయాలలో ప్రత్యేక పూజలు నిర్వహించగా భక్తులు అధికసంఖ్యలో పాల్గొని పూజలు నిర్వహించారు. ఆయా ఆలయాలలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

వైభవంగా మండల పూజా

రాజుపాళెం : మండలంలోని కొట్టాల గ్రామంలో నూతనంగా నిర్మించిన శివాలయం, రామాలయంలో వైభవంగా మండల పూజా కార్యక్రమాన్ని గ్రామస్తులు నిర్వహించారు. శనివారం ఉదయం నుంచి హోమాలు నిర్వహించి పూర్ణాహుతి సమర్పించారు. అభిషేకాలు, ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులు స్వాములను దర్శించుకుని కాయకర్పూరం సమర్పించారు. అక్కడికి వచ్చిన భక్తులకు ఆలయ కమిటీ సభ్యులు భక్తుల సహకారంతో అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. సాయంత్రం రామాపురం గ్రామానికి చెందిన మహిళలు చేసిన కోలాటం అందరిని ఆకట్టుకుంది. రాత్రి వేళలో భజన సంఘం సభ్యులు భజన పాటలు పాడారు.

ఒంటె వాహనంపై ఊరేగిన సంజీవరాయుడు



రాజుపాళెం : ఒంటె వాహనంపై సంజీవరాయస్వామిని ఊరేగిస్తున్న భక్తులు

రాజుపాళెం : మండలంలోని వెల్లాల పుణ్యక్షేత్రంలో శనివారం హనుమాన్ జయంతి వేడుకలను అంగరంగా వైభవంగా నిర్వహించారు. ఉదయం నుంచి శ్రీచెన్నకేశవ, సంజీవరాయస్వామికి అర్చకుడు విశేష పూజలు, అభిషేకాలు, ఆకు పూజలు చేశారు. అనంతరం భక్తులు పెద్ద సంఖ్యలో స్వాములను దర్శించుకుని కాయకర్పూరం సమర్పించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. సాయంత్రం ప్రత్యేకంగా అలంకరించిన పల్లకిలో ఒంటె వాహనంపై సంజీవరాయస్వామిని ఊరేగించారు. ఆలయ చైర్మన్ బి.జగదీశ్వరరెడ్డి, ఈఓ నరసయ్య ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు, కార్యక్రమంలో సింగిల్ విండో చైర్మన్ బాలనాగిరెడ్డి, సీనియర్ అసిస్టెంట్ రామ్మోహన్, భక్తులు పాల్గొన్నారు.



పోరుమామిళ్ల: చిన్నారుల కోలాటం ప్రదర్శన



పోరుమామిళ్ల: హనుమజ్జయంతి ఉత్సవాల్లో పాల్గొన్న మహిళలు



కలసపాడు: హరినామన భజన చేస్తున్న భక్తులు

వ్యవసాయ కార్యక్రమాలు విద్యార్థుల జీవితాలకు మలుపు



విజ్ఞాన ప్రదర్శనను తిలకిస్తున్న ముఖ్య అతిథులు, శాస్త్రవేత్తలు

మైదుకూరు : గ్రామీణ వ్యవసాయ అనుభవ పని కార్యక్రమాలు విద్యార్థుల జీవితాల్లో గొప్ప మలుపుగా చెప్పవచ్చని మైదుకూరు మండల వనిపెంట కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో మండలంలోని ఆదిరెడ్డిపల్లెలో అనంతరాజుపేట ఉద్యాన విద్యాలయం విద్యార్థులు పని అనుభవ కార్యక్రమంలో భాగంగా రైతు సదస్సు నిర్వహించారు. ఇందులో ముఖ్య అతిథిగా పాల్గొన్న అనంతరాజుపేట ఉద్యాన విద్యాలయం కీటక విభాగం అధిపతి ప్రొఫెసర్ ఎం.రామయ్య, కేవీకే అధిపతి, సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ బాలకృష్ణ, పోరుమామిళ్ల ఉద్యాన అధికారి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ వ్యవసాయ పని అనుభవ కార్యక్రమాలు (ఆర్‌ఏడబ్ల్యూఈపీ) విద్యార్థులకు ఎంతో ఉపయుక్తంగా ఉంటాయని పేర్కొన్నారు. ఇలాంటి కార్యక్రమాల్లో విద్యార్థులు పాల్గొనడం వలన పంట యాజమాన్య విధానాలు, రైతుల సాధక బాధకాలను ప్రత్యక్షంగా తెలుసుకునే అవకాశం వారికి కలుగుతుందని తెలిపారు. సదస్సులో మట్టి నమూనా పరీక్షల గురించి, వాటి ప్రాముఖ్యత, పోషకాల ఆవశ్యకత గురించి వివరించారు. సేంద్రీయ వ్యవసాయం ఉపయోగాలను మిరప, అరటి, పసుపులో వచ్చే కీటకాలు, తెగుళ్ల వాటి నివారణ, యాజమాన్య పద్ధతుల గురించి తెలిపారు. అనంతరాజుపేట ఉద్యాన విద్యాలయం అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ దీప్తికిరణ్, కేవీకే విస్తరణ విభాగం శాస్త్రవేత్త డాక్టర్ శ్రీవిద్యారాణి మాట్లాడుతూ అనంతరాజుపేట ఉద్యాన విద్యార్థులు చేసిన కార్యక్రమాలు, ప్రదర్శనల గురించి వృత్తి విద్యా శిక్షణ తరగతులు, రైతులతో చేసిన కార్యక్రమాలను వివరించారు. అనంతరం విద్యార్థులు ఏర్పాటు చేసిన విజ్ఞాన ప్రదర్శనను సందర్శించి అభినందించారు. కార్యక్రమంలో ఆదిరెడ్డిపల్లె, జంగంపల్లె, లెక్కలవారిపల్లె గ్రామాలకు చెందిన అభ్యుదయ రైతులు పాల్గొన్నారు.

మలేరియా నిర్మూలన అందరి బాధ్యత



నక్కలదిన్నెలో ర్యాలీ చేస్తున్న వైద్య సిబ్బంది

చాపాడు : మలేరియా నిర్మూలన అందరి బాధ్యత అని వైద్యాధికారి డా. కావ్య మాధురి అన్నారు. మండలంలోని నక్కలదిన్నె ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద మలేరియా వ్యతిరేక మాసోత్సవం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నక్కలదిన్నె దళితవాడలో మలేరియా నిర్మూలనపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి మాట్లాడుతూ దోమల వలన మలేరియా, డెంగీ, చికెన్ గున్యా, ఫైలేరియా, మెదడు వాపు వ్యాధులు వస్తాయన్నారు. దోమకాటు చాలా ప్రమాదమన్నారు. ఇంటి సమీపంలోని మురికి కాలువలో చెత్త చెదారం వేయకూడదని, మురికి నీరు నిలువ లేకుండా చూడాలన్నారు. ఇంటి పరిసరాలలో పనికి రాని, పడేసిన తొట్లు, డబ్బాలు, టైర్స్, కొబ్బరి చిప్పలు, పూల కుండీల్లో నీరు నిలువ లేకుండా చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీహెచ్ఈఓ ఎం.రాఘవయ్య, పీహెచ్ఎన్ సుకన్య, సూపర్‌వైజర్ బాబురెడ్డి, ఎంఎల్‌హెచ్‌పీ కీర్తి, ఏఎన్ఎం సుజాత, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య



బడిబాట కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఎంఈఓలు, ఉపాధ్యాయులు

కలసపాడు : విద్యార్థులకు ప్రభుత్వ పాఠశాలల్లో అన్ని వసతులతో కూడిన నాణ్యమైన విద్య లభిస్తుందని మండల విద్యాశాఖాధికారులు ప్రేమ్‌సాగర్, మస్తాన్‌వలి పేర్కొన్నారు. బడిబాట కార్యక్రమం సందర్భంగా శనివారం మండలంలోని గంగాయపల్లె, ఈ–రామాపురం, ఈ–తంబళ్లపల్లె, రెడ్డిపల్లె, డి–తంబళ్లపల్లె, సింగరాయపల్లె, కలసపాడు తదితర గ్రామాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో ఆహ్లాదకరమైన వాతావరణం, ఒత్తిడి లేని చదువు, కంప్యూటర్ శిక్షణ అందిస్తున్నామని చెప్పారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు. ట్రిపుల్‌ఐటీల్లో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ప్రాధాన్యత ఉంటుందన్నారు. ఉచిత యూనిఫాం, పాఠ్యపుస్తకాలు, బ్యాగ్, బూట్లు, పోషకాలతో కూడిన మధ్యాహ్న భోజనం అందిస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో సీ వెంకటరెడ్డి, ఎస్పీ సత్యనారాయణ, ఎస్ శివారెడ్డి, పీ కిరణ్‌కుమార్, కమాల్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల కౌటింగ్ నేపథ్యంలో ఆంక్షలు

కలసపాడు : సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ సందర్భంగా శనివారం నుంచి ఈ నెల 6 వ తేదీ వరకు ఆంక్షలు అమలులో ఉంటాయని, ప్రజలు పాటించాలని ఎస్ఐ నాగమురళి పేర్కొన్నారు. శనివారం ఆయన స్థానిక పోలీస్‌స్టేషన్‌లో విలేకరులతో మాట్లాడారు. ప్రజలు గుంపులు ఉండకూడదని, అవసరమైన పనులు చక్కబెట్టుకుని ఇళ్లకు వెళ్లాలని సూచించారు. ఊరేగింపులు, బాణాసంచా పేలుళ్ల, మైక్‌ల వినియోగంకు అనుమతి లేదన్నారు. సోషల్ మీడియా వేదికగా రెచ్చగొట్టే మెసేజ్‌లు, వీడియోలు పోస్ట్ చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. అందరూ పోలీసులకు సహకరించాలని కోరారు.

బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా దేవగుడి నారాయణరెడ్డి

జమ్మలమడుగు : జమ్మలమడుగు బార్ అసోసియేషన్ ఎన్నికలు ఏకగ్రీవం అయ్యాయి. శనివారం స్థానిక సివిల్‌కోర్టు ఆవరణలో అసోసియేషన్ ఎన్నికలను నిర్వహించారు. అసోసియేషన్ అధ్యక్షుడిగా దేవగుడి నారాయణరెడ్డి, సెక్రెటరీగా మురళీధర్ రెడ్డి, ఉపాధ్యక్షుడిగా భూతమాపురం సుబ్బారావు, జాయింట్ సెక్రటరీగా కుండా లోకేష్, ట్రెజరర్‌గా జ్యోతిరాణి, ఎగ్జిక్యూటివ్ సభ్యులుగా చంద్రశేఖర్ రెడ్డి, నాగార్జునరెడ్డి, ఆర్గనైజింగ్ సెక్రటరీగా పాలాజి రవికుమార్ తదితరులను ఎన్నుకున్నారు.

మండలానికి చేరుకున్న పాఠ్య పుస్తకాలు

ఎర్రగుంట్ల : మండలంలో ఉన్న ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు విద్యా కానుకలో భాగంగా 43 వేలు పాఠ్యపుస్తకాలు ఎర్రగుంట్లకు వచ్చాయని మండల విద్యాశాఖ అధికారులు శివప్రసాదు, వేంకటేశ్వర్లు తెలిపారు. శనివారం వారు మాట్లాడుతూ ప్రస్తుతం 50 శాతం పుస్తకాలు వచ్చాయన్నారు. మిగిలిన పాఠ్య పుస్తకాలు త్వరలోనే వస్తాయన్నారు. కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

అరటి పంటలపై రైతులకు అవగాహన

పులివెందుల రూరల్ : నియోజకవర్గ వ్యాప్తంగా ఉన్న గ్రామాల్లో అరటి పంట సాగుచేసే రైతులకు వ్యవసాయంలో నూతన పద్ధతులపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా అరటి పరిశోధన స్థానం ప్రధాన శాస్త్రవేత్త సునీల, శాస్త్రవేత్తలు నాగేంద్రారెడ్డి, సునీల్‌కుమార్‌లు రెండు రోజులుగా పెద్దరంగాపురం, పులివెందుల, నల్లపురెడ్డిపల్లె, వేముల, బెస్తవారిపల్లె గ్రామాల్లో ఉద్యాన రైతులకు వివిధ అంశాలపై అవగాహన కల్పించామన్నారు. అందులో భాగంగా వేల్పుల రైతు భరోసా కేంద్రంలో జరిగిన రైతుల సమావేశంలో విద్యార్థులు వ్యవసాయంలో నూతన పద్ధతులపై ప్రదర్శనలు ఏర్పాటు చేశారు.

పుస్తకాలు విద్యార్థులకు నేస్తాలు



అట్లూరు: పుస్తకం పఠనం చేస్తున్న విద్యార్థులు

అట్లూరు : పుస్తకాలు విద్యార్థులకు నేస్తాలని, పుస్తక పఠనంతో విద్యార్థుల్లో ఏకాగ్రత, జ్ఞాపకశక్తి పెరుగుతుందని గ్రంథాలయ అధికారి ఎం.సుధాకర్ పేర్కొన్నారు. స్థానిక గ్రంథాలయంలో శనివారం సమ్మర్ క్యాంపులో భాగంగా హాజరైన 25 మంది విద్యార్థులకు పుస్తక పఠనంతో పాటు నీతికథలు చదివించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ఆట, పాటలు ఉత్తేజాన్ని నింపితే పుస్తక పఠనం జ్ఞాపక శక్తిని పెంపొందిస్తుందన్నారు. నీతికథలు నిజ జీవితంలో ఎంతో ఉపయోగపడుతాయన్నారు.

విద్యార్థులకు డ్రాయింగ్ పోటీలు

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక వసంతపేట మున్సిపల్ హైస్కూల్‌లో శనివారం బాలబాలికల గ్రంథాలయం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వేసవి శిక్షరిటైర్డు ణ శిబిరంలో విద్యార్థులకు డ్రాయింగ్ పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా వైమానిక దళ ఏఈ వెంకటకొండయ్య, డ్రాయింగ్ మాస్టర్ సుభాష్ హాజరై న్యాయ నిర్ణేతలుగా వ్యవహరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థుల్లో దాగిన సృజనాత్మకతను వెలికి తీసేందుకే ఈ డ్రాయింగ్ పోటీలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయురాలు నిర్మల జ్యోతి, గ్రంథాలయ రికార్డు అసిస్టెంట్ ఇబ్రాంసాహెబ్, హైస్కూ సిబ్బంది రెహామ్‌ఖాన్ పాల్గొన్నారు.

ప్రజా నాయకుడు వైఎస్ అవినాష్‌రెడ్డి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న రెడ్యం

ఖాజీపేట : ప్రజా నాయకుడు ఎంపీ అవినాష్‌రెడ్డి అత్యధిక మెజార్టీతో గెలవబోతున్నారని ఏపీఎస్ఆర్టీసీ కడప జోన్ మాజీ అధ్యక్షుడు రెడ్యం వెంకటసుబ్బారెడ్డి ఆశాభావం వ్యక్తం చేశారు. దుంపలగట్టు గ్రామంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ నిత్యం ప్రజల్లో ఉంటే అవినాష్‌రెడ్డికే ప్రజలు అండగా నిలబడ్డారని తెలిపారు. కడప పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి షర్మిలకు డిపాజిట్ కూడా దక్కదని ఎద్దేవాచేశారు. కడప పార్లమెంట్ టీడీపీ అభ్యర్థి భూపేష్‌రెడ్డిని బలిపశువును చేశారని విమర్శించారు. ఈ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థులు ఘన విజయం సాధిస్తారని ధీమావ్యక్తం చేశారు. టీడీపీకి ప్రజలు గుణపాఠం చెప్పబోతున్నారని జోస్యం చెప్పారు. ఈ కార్యక్రమంలో రెడ్యం నాగేశ్వర్‌రెడ్డి, మున్నెల్లి వెంకటసుబ్బయ్య పాల్గొన్నారు.

జగనన్న మళ్లీ సీఎం కావాలని పూజలు

సంక్షేమ సారథి సీఎం జగన్ మళ్లీ సీఎం అవుతారని వైఎస్సార్‌సీపీ మండల నాయకుడు మురళీమోహన్ రెడ్డి, అగ్రహారం సొసైటీ అధ్యక్షుడు రాఘవరెడ్డి ధీమా వ్యక్తం చేశారు. హనుమాన్ జయంతి పురస్కరించుకుని సుంకేశుల గ్రామంలోని ఆంజనేయ స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. సీఎంగా జగన్, ఎంపీగా వైఎస్ అవినాష్‌రెడ్డి, ఎమ్మెల్యేగా రఘురామిరెడ్డి గెలవాలని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కేసీకెనాల్ ప్రాజెక్టు కమిటీ మాజీ అధ్యక్షుడు డీఎల్ శ్రీనివాసులరెడ్డి, కొండారెడ్డి, బీబి సుబ్బారెడ్డి, గజ్జల చెన్నారెడ్డి, పాలకొలను లక్ష్మీనారాయణరెడ్డి పాల్గొన్నారు.

ఘనంగా ఉద్యోగ విజయోత్సవ వేడుకలు



ఉద్యోగాలు సాధించిన విద్యార్థులతో ముఖ్య అతిథులు

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక కొర్రపాడు రోడ్డులోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో శనివారం డిప్లమో పూర్తి చేసుకున్న విద్యార్థులు ఉద్యోగ విజయోత్సవ వేడుకలను జరుపుకొన్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా యోగివేమన ఇంజనీరింగ్ కళాశాల ఆచార్యులు జయచంద్రారెడ్డి, జయరామిరెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చదువుకునే సమయంలోనే మంచి నైపుణ్యాలను సంపాదిస్తే సులభంగా ఉద్యోగాలు సాధించవచ్చన్నారు. సివిల్ ఇంజనీరింగ్ విభాగంలో గ్యాంబ్రియల్ ఇంజనీర్స్ లిమిటెడ్, ఎస్సార్‌ప్లానర్స్, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ విభాగంలో భాగ్యశ్రీ ఇండస్ట్రీస్, లేబరొనెట్ సర్వీస్ ఇండియాలిమిటెడ్, మెకానికల్ విభాగంలో గ్రీన్‌టెక్ ఇండస్ట్రీస్, జేసీబీ గోల్డ్ ఫీల్డ్స్, జీ ఏరోస్పేస్ కంపెనీలలో రూ.1.9 లక్షల నుంచి రూ.2.2 లక్షల వార్షిక వేతనంతో ఉద్యోగాలు సాధించిన 176 మంది విద్యార్థులకు నియామక పత్రాలను ముఖ్య అతిథులు, ప్రిన్సిపాల్ జగదీశ్వరుడు అందచేశారు. కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.